
సాక్షి
బాపట్ల
ఆదివారం । 25 । మే । 2025



మాదిపాడులో రీసర్వే

అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో శనివారం భూముల రీ సర్వే ప్రక్రియ ప్రారంభమైంది. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు జానీబాషా, వీఆర్వోలు పాల్గొన్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 512.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 5,598 క్యూసెక్కులు విడుదలవుతోంది.

చందన అలంకరణలో వేణుగోపాలుడు



సత్తెనపల్లి: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో స్వామివారికి శనివారం చందనోత్సవ అలంకరణ చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ప్రాణం పోయరూ..!

- చీరాల ప్రభుత్వాసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌కు మరమ్మతులు
- కోవిడ్ సమయంలో రూ.1.06 కోట్లతో ఏర్పాటు చేసిన నాటి సీఎం వైఎస్ జగన్
- టెక్నీషియన్ లేడన్న సాకుతో నేడు ప్లాంటుకు తాళం
- తుప్పుపట్టిపోతున్న జనరేటర్, పరికరాలు
- మళ్లీ కోవిడ్ భయాల నేపథ్యంలో మరమ్మతులు చేయాలంటున్న ప్రజలు

నిర్లక్ష్యం నీడలో ప్రాణవాయువు ప్లాంట్

కోవిడ్–19.. ఈ పేరు వింటేనే చాలా మంది చిగురుటాకుల్లా వణికిపోతారు. నాటి హృదయ విదారక ఘటనలు జ్ఞప్తికి తెచ్చుకోవడానికి సైతం భయపడతారు. ఆస్పత్రుల్లో వేలాది మంది ప్రాణాల కోసం పోరాడడం.. శ్మశానాలు కోవిడ్ మృతులతో నిండిపోవడం.. కోవిడ్ సోకి క్వారంటైన్ పేరిట తల్లీ, పిల్లలు వేరుకావడం.. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరిస్తేనే గానీ బయటకు రాలేకపోవడం.. నిత్యం జనసమ్మర్ధంతో నిండిపోయే మార్కెట్లు సైతం వెలవెలబోవడం అందరం చూశాం .ఆ కలవర కల్లోల పరిస్థితుల్లో అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో నాటి సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్లు ఎందరికో ఊపిరి పోశాయి. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో నేడు అవి కునారిల్లుతున్నాయి.



చీరాల ప్రభుత్వాసుపత్రిలో మరమ్మతులకు లోనైన ఆక్సిజన్ ప్లాంట్

చీరాల రూరల్: కోవిడ్‌తో వేలాది మంది ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోతున్న సమయంలో నాటి ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధీశాలిగా నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో యుద్ధప్రాతిపదికన రూ.కోట్లు వెచ్చించి ఆక్సిజన్ ప్లాంట్లను నెలకొల్పి లక్షలాదిమంది ప్రాణాలను కాపాడారు. ఇలా చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో రూ.1.06కోట్లతో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి చేతుల మీదుగా ఆక్సిజన్ ప్లాంటు ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ప్లాంటుకు అనుసంధానంగా ఆస్పత్రి ప్రాంగణంలోనే భారీసైజులో టెంట్లు వేసి.. అదనంగా బెడ్లువేసి నిరంతరాయంగా ఆక్సిజన్‌ను సరఫరా చేయించిన ఘనత నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే.

మళ్లీ మహమ్మారి విజృంభణ!

ప్రస్తుతం కొన్ని దేశాల్లో కోవిడ్ విజృంభిస్తోంది. ఆయా దేశాల్లో మాస్కులు, శానిటైజర్లు వంటివి వాడుతూ తగు జాగ్రత్తలు పాటిస్తున్నారు. దేశంలోని కేరళ, మహారాష్ట్రలో కూడా ఇప్పటివరకు 2708 పైగా కేసులు నమోదయ్యాయి. విశాఖలో కూడా కేసులు వెలుగుచూస్తుండటం గమనార్హం. ఈ తరుణంలో చీరాల ప్రభుత్వాసుపత్రిలోని ఆక్సిజన్ ప్లాంటు ఏడాదిన్నరగా మూలన పడడం స్థానికులను కలవర పరుస్తోంది.

ఫొటో తీసేస్తే సరిపోతుందా?

టెక్నీషియన్ లేడన్న సాకుతో ఆస్పత్రి నిర్వాహకులు రూ.కోటిపైగా వెచ్చించి నిర్మించిన ఆక్సిజన్ ప్లాంటుకు తాళాలేసి మూలనపెట్టారు. అంతేకాక



నిరుపయోగంగా భారీ జనరేటర్

సెన్సార్ పనిచేయడంలేదని, కంప్రెషర్ పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. మరికొద్దికాలం గడిస్తే ప్లాంటులోని ముఖ్యమైన పరికరాలు ఎందుకు పనికిరాకుండా పాడై పోతాయని వైద్యులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్లాంటుపై ఉన్న నాటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోను, ఆయన పేరును మాత్రం తొలగించడంతో సరిపెట్టారు కానీ.. మరమ్మతులు చేయలేదు.

అత్యవసర సమయాల్లో ఎలా?

ఆక్సిజన్ ఒక్క కోవిడ్ రోగులకే కాకుండా, తల్లీ బిడ్డల వార్డుల్లో చేరిన గర్భిణులు, గాయాలపాలై ఆస్పత్రిలో చేరిన క్షతగాత్రులకు, పురుగుమందులు తాగిన వారు, ఆపరేషన్‌లు చేయించుకునే రోగులు, ఆస్తమా పేషెంట్లు, హైరిస్క్ పేషెంట్లకు కూడా అవసరమవుతుంది. 108 అంబులెన్స్‌లో తప్పనిసరి. ఈ క్రమంలో ప్రభుత్వాసుపత్రిలో నెలకు సరాసరి ఏడు నుంచి పది వరకు ఆక్సిజన్ సిలిండర్లు అవసరం అవుతాయి. ఒకవేళ ఆక్సిజన్ ప్లాంట్ పని చేస్తే సిలిండర్లు కొనే అవసరం ఉండదు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకపోవడంతో ఆక్సిజన్ సిలిండర్ల కొరత అధికంగా ఉన్నట్లు రోగులు చెబుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఆక్సిజన్ ప్లాంటు మరమ్మతులకు గురైన విషయం ఉన్నతాధికారులకు నివేదించాం. కొద్ది రోజుల్లోనే మరమ్మతులు చేయించి రోగులకు అందుబాటులోకి తీసుకువస్తాం. ప్లాంటుకు ప్రత్యేకంగా టెక్నీషియన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం రోగులకు ఆక్సిజన్ కొరతలేకుండా కాన్సన్‌ట్రేషన్లు పెడుతున్నాం.

– డాక్టర్ శ్రీకాంత్, ఆస్పత్రి సూపరింటెండెంట్

నాడు విస్తృత సేవలు

- దుగ్గిరాల గోపాలకృష్ణయ్య స్మారక వంద పడకల (చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల) ఆస్పత్రి రోగుల పాలిట కల్పవల్లిగా నిలిచింది.
- చీరాలతో పాటు బాపట్ల, అద్దంకి నియోజకవర్గాల్లోని పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారింది.
- తల్లీ పిల్లల వార్డులు, సీటీ స్కాన్, కిడ్నీ రోగులకు డయాలసిస్ యూనిట్, హెచ్ఐవీ రోగుల కోసం ఏఆర్‌టీ సెంటర్, రక్తనిధి కేంద్రం ఉంది.
- రోడ్డు ప్రమాదాల బాధితులు అధిక సంఖ్యలో వైద్యసేవలు పొందుతుంటారు.
- విద్యుత్ అంతరాయంలో ఆక్సిజన్ ప్లాంటుకు ఉపయోగపడే విధంగా జనరేటర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు.
- అయితే ప్రస్తుతం ఇవన్నీ ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పాడై పోతున్నాయి.

సముద్ర తీరప్రాంతాల్లో డ్రోన్‌లతో నిఘా

ఎస్పీ తుషార్‌డూడీ



తీరంలో డ్రోన్‌లతో నిఘా నిర్వహిస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: యాత్రికుల రక్షణ, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సముద్రతీర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచనున్నామని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శనివారం జిల్లాలోని సూర్యలంక, రామాపురం, వాడరేవు సముద్రతీర ప్రాంతాల్లో డ్రోన్లను ఎగురవేసి పరిస్థితులను పరిశీలించారు. ఎస్పీ తుషార్‌డూడీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లలో ఆహ్లాదకరంగా గడిపేందుకు చుట్టుపక్క ప్రాంతాల నుంచే కాక ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి యాత్రికులు వస్తుంటారన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో యాత్రికులు అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా సముద్ర తీర ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత చర్యలు తీసుకుంటున్నామన్నారు. తీరంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అరికట్టే ఉద్దేశంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ డ్రోన్‌లతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. డ్రోన్‌లను సముద్ర తీరాలలో ఎగరవేసి వాటి ద్వారా యాత్రికులు ఎవరైనా ఎక్కువ లోతుకు వెళుతున్నట్లయితే వారిని గుర్తించి హెచ్చరించడం, ఎవరైనా ప్రమాదానికి గురయినట్లయితే వెంటనే గజఈతగాళ్లు, అవుట్ పోస్ట్, మెరైన్ పోలీసులను అప్రమత్తం చేసి వారిని కాపాడడం, యాత్రికులకు, మహిళలకు అసౌకర్యం కలిగించే ఆకతాయిలను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు డ్రోన్లు ఎంతగానో దోహదపడుతాయన్నారు.

న్యూస్‌రీల్

ఉచిత న్యాయ సహాయం పొందండి



నరసరావుపేటటౌన్: లైంగిక వేధింపులకు గురైన బాధితులు మండల న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించి ఉచిత న్యాయ సహాయం పొందాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎస్. సత్యశ్రీ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో పారా లీగల్ వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురయితే జాతీయ న్యాయసేవాధికార సంస్థ ప్రవేశ పెట్టిన హెల్ప్ లైన్ నెం. 15100కు ఫిర్యాదు చేయాలన్నారు. అదే విధంగా జాతీయ మహిళా హెల్ప్‌లైన్ 7827170170 నంబర్‌ను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. లైంగిక వేధింపుల చట్టం గురించి అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

31న జెడ్పీస్థాయీ సంఘ సమావేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజాపరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రణాళిక-ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య-వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్నాయి. వ్యవసాయంపై 3వ స్థాయి సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంటిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ-శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరగనున్నాయి. స్థాయీ సంఘ సమావేశాలకు ఆయా సంఘాల సభ్యులతో పాటు మూడు జిల్లాల పరిధిలోని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని సీఈవో జ్యోతిబసు సూచించారు.


యోగాంధ్రపై విస్తృత ప్రచారం



నరసరావుపేట: యోగాంధ్రలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధికారులకు సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంపై శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండలస్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జూన్ 21 వరకు యోగా ప్రాముఖ్యతను విస్తృత ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగించాలన్నారు. యోగా ప్రాముఖ్యతను తెలిపేలా విద్యార్థులకు, ఆయా రంగాల్లోని వారికి వివిధ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి మండలంలో యోగా శిక్షకులను గుర్తించి అభ్యాస కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎక్కువ సంఖ్యలో యోగా అభ్యాసకులకు ప్రజలను నమోదుచేసేందుకు కృషిచేయాలన్నారు. ప్రతిరోజూ నరసరావుపేటతో పాటు మున్సిపాల్టీలు, మండలస్థాయిలో యోగా ప్రాముఖ్యతను తెలిపే కార్యక్రమాలను నిర్వహించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. డీఆర్‌ఓ ఏకా మురళి పాల్గొన్నారు.

పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయించండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి



నరసరావుపేట: జిల్లాలో పిల్లలకు ఆటలమ్మ, రూబెల్లా వ్యాధులు సంక్రమించకుండా ఎంఆర్ వ్యాక్సిన్ కోసం తల్లిదండ్రులు సమీపంలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కోరారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లాలో మీజిల్స్ రుబెల్లా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మూడు విడతలుగా ప్రత్యేక ఎంఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి 31వరకు, జూన్ 23 నుంచి 28వరకు, జూలై నెలలో 21 నుంచి 26వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ మొదటి డోసు తొమ్మిది నుంచి 12 నెలల మధ్య, రెండో డోసు 16 నెలల నుంచి 24 నెలల మధ్య వేయాలని పిల్లలకు వేయించాలని కోరారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఎంఆర్ వ్యాక్సిన్ మొదటి, రెండో డోసులు వేయించుకోని పిల్లలకు కూడా వ్యాక్సిన్ వేస్తారన్నారు.

స్టువర్టుపురం.. శోకసంద్రం

- స్వగ్రామానికి చేరుకున్న ఆరుగురి మృతదేహాలు
- ఆటోనగర్ శ్మశాన వాటికలో అంత్యక్రియలు

బాపట్లటౌన్: ఘోర రోడ్డు ప్రమాదంలో బాపట్ల మండలం, స్టువర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మృతిచెందిన ఘటన తెలిసిందే. ఆరుగురు మృతదేహాలు ప్రకాశం జిల్లా, గిద్దలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం శనివారం మధ్యాహ్నం స్వగ్రామమైన స్టువర్టుపురం గ్రామానికి తరలించారు. ఆరుగురు మృతదేహాలు గ్రామానికి తరలిరావడంతో శనివారం గ్రామంలో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహాల వద్దకు చేరుకొని విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది.

మిన్నంటిన రోదనలు

'నేడో, రేపో పెళ్లి చేద్దామనుకుంటున్న తరుణంలో మీరు శవాలై కనిపిస్తారని మేము కలలో కూడా ఊహించలేదయ్యా'... 'మీపైనే ఆశలు పెట్టుకొని బతుకుతున్నాం...ఇంకా మాకు దిక్కెవరూ'... 'మాకు తలకొరివి పెట్టాల్సింది పోయి...మీకే మేము పెట్టాల్సి వస్తోంది...మేమేమి పాపం చేశాము దేవుడా' అంటూ గజ్జల జనార్ధన్, బొచ్చు సన్నీ, కర్రెద్దుల దివాకర్‌ల తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు స్థానికులకు కంటతడి పెట్టించింది. 'సాయంత్రానికి తిరిగొస్తామని చెప్పి శవాలై వచ్చారా' అంటూ గజ్జల అంకాలు కుటుంబ సభ్యులు, 'మా అమ్మ నా కళ్లముందే చనిపోయిందంటూ' మొగిలి భవానీ కుమార్తె, కొడుకు సిరి, సిద్దూ చెబుతున్న మాటలకు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు గుండెలు పగిలేలా రోధించారు. లేకలేక పుట్టిన ఒక్కగానొక్క బిడ్డను, నన్ను ఒంటరిని చేసి కానరాని లోకాలకు వెళ్లిపోయావా దేవుడా అంటూ గజ్జల నరసింహ భార్య జాబిల్లి విలపిస్తున్న తీరు చూపరులను సైతం కంటతడి పెట్టించింది.

అశ్రునయనాలతో అంత్యక్రియలు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్టువర్టుపురం గ్రామం, న్యూ గ్యాంగ్‌కు చెందిన గజ్జల నరసింహ (23), గజ్జల అంకాలు (45), పెద్ద గ్యాంగ్‌కు చెందిన గజ్జల జోసఫ్ అలియాస్ బబ్బులు (25), కర్రెద్దు దివాకర్(24), 6వ గ్యాంగ్‌కు చెందిన బొచ్చు సన్నీ(27), 1వ గ్యాంగ్‌కు చెందిన మొగిలి చిన్న భవానీ (23)ల అంత్యక్రియలు శనివారం సాయంత్రం స్టువార్టుపురం–ఈపూరుపాలెం మధ్యలోని ఆటోనగర్ శ్మశానవాటికలో నిర్వహించారు. మృతదేహాలు స్వగ్రామమైన స్టువర్టుపురం చేరుకోవడంతో బాపట్ల ఎంపీపీ చిన్నపోతుల హరిబాబు మృతుల గృహాలకు చేరుకొని మృతదేహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మృతిచెందిన ప్రతి ఒక్కరికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియో ప్రకటించి, నిరుపేదలైన కుటుంబసభ్యులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆటోనగర్‌లోని శ్మశానవాటికకు చేరుకొని మృతదేహాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబీకులకు ప్రభుత్వం తరఫున అందించాల్సిన అన్నిరకాల సహాయ సహకారాలు అందించేలా కృషిచేస్తామన్నారు.



గిద్దలూరు ప్రభుత్వాసుపత్రి నుంచి మృతదేహాలను తరలిస్తున్న బంధువులు



మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

ముగిసిన పోస్టుమార్టం

కొమరోలు: మండలంలోని తాటిచెర్లమోటు సమీపంలో శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా ఇద్దరు చిన్నారులు తీవ్ర గాయాలతో బయటపడిన విషయం తెలిసిందే. బాపట్ల జిల్లా స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు మృతి చెందగా మృతదేహాలను పోస్టుమార్టం కోసం గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న మృతుల బంధువులు స్టూవర్టుపురం నుంచి గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం వైద్యులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం ఆరు మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

చిన్నారులకు మెరుగైన వైద్యం

ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మృతి చెందిన వారితో పాటు జీతన్, శిరీషలు ఆ కారులోనే ప్రయాణిస్తున్నారు. గాయపడిన వీరికి గిద్దలూరు వైద్యశాలలో ప్రథమ చికిత్స అందించి అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించినట్లు స్థానిక ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం

వెల్లడించిన మార్కాపురం డీఎస్పీ నాగరాజు

కొమరోలు: తాటిచెర్లమోటు కారు ప్రమాదానికి మితిమీరిన వేగమే కారణమని మార్కాపురం డీఎస్పీ నాగరాజు వెల్లడించారు. ఆర్‌టీఓ అల్లం మాధవరావుతో కలిసి శనివారం ఆయన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదానికి గురైన కారును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం డీఎస్పీ నాగరాజు మాట్లాడుతూ ప్రమాదం జరిగిన సమయంలో కారు వేగం 120 కిలోమీటర్లు ఉందని స్పష్టం చేశారు. కారు వేగంగా వెళ్లి లారీని ఢీకొనడం వల్లే ప్రమాద తీవ్రత పెరిగిందని చెప్పారు. వాహనాలను నిర్లక్ష్యంగా, వేగంగా ఎవరూ నడపొద్దని సూచించారు. నేషనల్ హైవే ప్రాజెక్టు మేనేజర్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ ఎం.నరసింహులు, గిద్దలూరు, కంభం సీఐలు రామకోటయ్య, మల్లికార్జున, ఎస్ఐలు రవీంద్రరెడ్డి, నాగరాజు, కోటేశ్వరరావు, సుదర్శన్ పాల్గొన్నారు.



ఘటనాస్థలి వద్ద డీఎస్పీ నాగరాజు

నల్లబర్లీ కొనుగోలు చేయిస్తాం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మార్టూరు: నల్లబర్లీ పొగాకు సాగు చేసి కొనుగోలు జరక్క ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అండగా ఉంటామని పొగాకు కంపెనీలచే రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. స్థానిక ఇసుక దర్శిలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం నల్ల బర్లీ పొగాకు సాగు చేసిన రైతులు, పొగాకు కంపెనీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, కలెక్టర్ కె.వెంకట మురళి, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, పొగాకు బోర్డు, కంపెనీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

మంత్రుల పర్యటన సాగిందిలా...

మొదట యద్దనపూడి మండలం సూరవరపు పల్లె గ్రామ పరిధిలోని కోల్డ్ స్టోరేజ్ వద్ద నిల్వచేసి ఉన్న నల్ల బర్లీ పొగాకును మంత్రి అచ్చెన్నాయుడు బృందం పరిశీలించి రైతులను అడిగి వివరాలు తెలుసుకుంది. అనంతరం మార్టూరులోని మద్ది లక్ష్మయ్య ఆగ్రో ప్రోడక్ట్ (ఎంఎల్ఏపీ) పొగాకు కంపెనీని పరిశీలించి పొగాకును ప్రాసెసింగ్ చేసే విధానాన్ని పరిశీలించి సంస్థ ప్రతినిధులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి మాట్లాడారు. నల్ల బర్లీ పొగాకును గత సంవత్సరం కొనుగోలు చేసినట్లే కంపెనీలు ఈ సంవత్సరం కూడా కొనుగోలు చేయాలని, కొనుగోలు చేయించి రైతులకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ సంవత్సరం నల్ల బర్లీ పొగాకు మొత్తం 80 మిలియన్ కిలోల ఉత్పత్తి జరిగిందని కంపెనీలు మొత్తం కొనుగోలు చేయవలసిందేనన్నారు. కంపెనీలు కొనుగోళ్లు తక్షణమే ప్రారంభించాలన్నారు. ప్రాసెసింగ్ కోసం అయ్యే ఖర్చు రూ.150 కోట్లు ముఖ్యమంత్రితో మాట్లాడి కంపెనీలకు ఇప్పిస్తానని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న పొగాకును రెండు గ్రేడులుగా విభజించి నాణ్యత కలిగిన పొగాకు క్వింటా రూ.12 వేలకు, రెండో రకం రూ.5వేల నుంచి 6వేలకు తగ్గకుండా శనివారం నుంచి కొనుగోలు చేయాలని మంత్రి అన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర పబ్లిసిటీ వింగ్‌లో నియామకాలు

అద్దంకి: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర పబ్లిసిటీ, బూత్ కమిటీ వింగ్‌లో జిల్లాకు చెందిన ఇద్దరు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. జె.పంగులూరు మండలానికి చెందిన పులికం కోటిరెడ్డిని రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీగా, కొరిశపాడు మండలానికి చెందిన కోయి అంకారావు, రేపల్లెకు చెందిన వి.అహరోన్ పాల్‌ను స్టేట్ పబ్లిసిటీ వింగ్ జాయింట్ సెక్రటరీలుగా నియమిస్తున్నట్లు ప్రకటించారు.

దేశంలో నరహంతక పాలన

- ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను హతమార్చుతున్న కేంద్రం
- విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

లక్ష్మీపురం: దేశంలో బీజేపీ నరహంతక పాలన కొనసాగిస్తోందని, మతాల మధ్య చిచ్చు పెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. బీజేపీ పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గుంటూరు కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మల్లయ్య లింగం భవన్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర స్థాయి పాటలు, కళా రూపాల శిక్షణ శిబిరం శనివారం రెండో రోజు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ రంగాలకు అన్నీ అప్పగిస్తోందన్నారు. కమ్యూనిస్టు భావజాలాన్ని అంతం చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలేశారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల తోపాటు ఆదివాసీలను దారుణంగా హతమార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చలకు వస్తామని చెప్పినప్పటికీ కేంద్రం వారిని చంపే కార్యక్రమం చేయడం సరికాదన్నారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను కేంద్రం ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో సరికొత్త నాటకానికి ప్రధాని నరేంద్ర మోదీ తెర తీశారన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు భయపడి మోదీ పాక్‌పై యుద్ధాన్ని ఆపేశారని తెలిపారు. విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటానికి సన్నద్ధం అవుతామన్నారు. మహాసభలకు ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

సూసైడ్ నోట్ రాసి ఇంట్లోంచి వెళ్లిపోయిన భార్య

కొత్తపట్నం సముద్రతీరం వద్ద కనుగొని భర్తకు అప్పగించిన పోలీసులు


వెంకటకీర్తిని భర్త నిఖిల్‌కు అప్పగిస్తున్న ఎస్ఐ మహ్మద్ రఫీ

మేదరమెట్ల: సూసైడ్ నోట్ రాసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన భార్యను పోలీసులు అత్యంత వేగంగా వెదికి తిరిగి భర్తకు అప్పగించిన ఘటన శనివారం మేదరమెట్లలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మేదరమెట్ల గ్రామానికి చెందిన వెల్లంకి వెంకటకీర్తి తనకున్న అనారోగ్య సమస్యల వల్ల సూసైడ్ నోట్ రాసి ఈనెల 23వ తేదీ సాయంత్రం ఇంట్లో ఉంచింది. తన ఫోన్‌ను కూడా ఇంట్లోనే పెట్టి వాకింగ్‌కు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లింది. ఎంతకీ రాకపోడంతో కుటుంబ సభ్యులు ఆ లేఖ గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు శనివారం చీరాల, కొత్తపట్నం, చిన్నగంజాం సముద్ర తీరాలకు వెళ్లి వెతుకుతుండగా వెంకటకీర్తి కొత్తపట్నం సముద్ర తీరం వద్ద కనిపించింది. ఆమెను ఎంతో చాకచక్యంగా పట్టుకొని మేదరమెట్ల పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి ఆమె భర్త నిఖిల్‌కు అప్పగించారు. ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వ్యక్తిని తక్కువ సమయంలోనే పట్టుకొని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో సమావేశం


సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి ఆర్ఎం రవికాంత్

చీరాల అర్బన్: ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం బస్‌స్టేషన్లలో ఓపెన్ ప్రదేశాల్లో 15 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకుగాను శనివారం ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా ఇన్‌చార్జి ఆర్ఎం ఎం.రవికాంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీరాల ఆర్టీసీ డిపో పరిధిలోని చీరాల, పర్చూరు, ఇంకొల్లు, వేటపాలెం బస్‌స్టేషన్లలో ఓపెన్ ప్రదేశాల్లో 15 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, దరఖాస్తుదారులు 29వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు నెల్లూరులోని ఈడీ కార్యాలయంలోని టెండర్ బాక్సులో వేయాలన్నారు. చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఇప్పటికే ఖాళీ స్థలంలో హోటల్ నిర్మాణం జరిగిందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపి వ్యాపారాభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన చీరాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణాన్ని పరిశీలించారు. కార్గో పాయింట్, రిజర్వేషన్ కౌంటర్, ఖాళీ ప్రదేశాలను పరిశీలన చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్టీసీ డిపో మేనేజర్ జె.శ్యామల, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పిల్లలను సురక్షితంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులదే

న్యాయ సేవా సదన్ సెక్రటరీ సయ్యద్ జియావుద్దీన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: పిల్లలను సురక్షితంగా ఉంచే బాధ్యత తల్లిదండ్రులదేనని, సమాజంలో పౌరులుగా మనందరి బాధ్యత కూడా అని న్యాయ సేవా సదన్ సెక్రెటరీ సయ్యద్ జియావుద్దీన్ అన్నారు. పిల్లలు జాగ్రత్తగా ఉండేందుకు తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు చేశారు. క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు శనివారం అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా అవగాహనా సదస్సు నిర్వహించారు. సదస్సుకు జియావుద్దీన్ అధ్యక్షత వహించి, మాట్లాడారు. పిల్లలు తప్పిపోవడం అనేది తల్లిదండ్రులు, సమాజానికి పెద్ద సవాలుగా మారిందన్నారు. ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో పిల్లలు కనిపించకుండా పోతున్నారని, వారిలో కొంతమంది తిరిగి వచ్చినా చాలా మంది జాడ తెలియరాలేదని తెలిపారు. అధికారిక గణాంకాల ప్రకారం మూడు సంవత్సరాలలో 10వేలకుపైగా మిస్సింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. 2022లో 83,350 మంది చిన్నారులలో 62,946 మంది బాలికలు ఉన్నారని, ప్రతి నలుగురు పిల్లలలో ముగ్గురు బాలికలున్నారని వెల్లడించారు. ప్యానల్ అడ్వకేట్ కె.కాళిదాసు మాట్లాడుతూ ప్రామాణిక ఆపరేటింగ్ ప్రొసిజర్ పోలీస్ యూనిట్ ఎలా పనిచేస్తుంది, పిల్లలు తప్పిపోతే ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేయాలి, పిల్లలు ట్రేస్ కాకపోతే ఆ కేసును సీఐడీకి ఎలా బదిలీ చేయాలో వివరించారు. జిల్లా పంచాయత్ ఆఫీసర్ సాయికుమార్, డీపీఓ, శిశు సంక్షేమ శాఖ విజయ్‌కుమార్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హనుమాన్ సాయి మాట్లాడుతూ తప్పిపోయిన పిల్లలను కాలయాపన లేకుండా ఎలా ట్రేస్ చేయగలమో వివరించారు. బాల కార్మికులుగా పనిచేసే పిల్లలను గుర్తించి వారికి రక్షణ కల్పించి, వారి భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దవచ్చునో వివరించారు. కార్యక్రమంలో అన్ని రంగాలకు చెందిన ప్రభుత్వ అధికారులు, ప్యానల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): గవర్నర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రకాశం జిల్లా పూసుగూడేనికి చెందిన బత్తుల రాజు, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజకు చెందిన బండారి లక్ష్మీనారాయణ, నరసరావుపేట సంజీవయ్య కాలనీకి చెందిన ఉప్పు ఎల్లయ్య, గుంటూరు శివనాగరాజు కాలనీకి చెందిన తిరుపతి వెంకట దుర్గారావులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వీరంతా పోలీసు కంట్రోల్ రూం సమీపంలో నడిచి వెళ్లే ప్రయాణికులను బెదిరించి సెల్‌ఫోన్‌లు లాక్కుని వెళ్లి పోతుంటారని సీఐ అడపా నాగమురళి తెలిపారు.

యస్‌బియమ్‌సి బ్రాంచి
శ్రీ బాపూజి మార్కెట్ కాంప్లెక్స్, ఒంగోలు, ప్రకాశం జిల్లా - 523001.
ఫోన్: 87792 17831, e-Mail ID: ubin0817830@unionbankofindia.bank

ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకము కొరకు)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ బ్రాంచ్,** అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు మరియు హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదేమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొదలగు తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించినవిధంగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించటమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు "అక్కడ ఏది ఉంటే అది" ప్రాతిపదికన** దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతల మరియు హామీదారుల నుండి రావలసిన బకాయి మొత్తమును కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శ్రీ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ బ్రాంచ్ వారిచే ఇ-వేలం"** ద్వారా **ది.26-06-2025** న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది. **రిజర్వుధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

	ఋణగ్రహీతలు మరియు హామీదారుల వివరములు	స్థిరాస్తి వివరములు	రిజర్వు ధర(రూ)	ధరావత్తు ధర(రూ)	బిడ్ పెంపుదల
1	ఋణగ్రహీత(లు)/ సహ-పూచీదారు(లు)/ తనఖాదారు(లు)/ హామీదారు(లు) : 1) మెస్సర్స్ శ్రీకాంత్ ట్రెండ్స్, మేనేజింగ్ పార్టనర్ : శ్రీ దామ వెంకటనారాయణ, పార్టనర్ శ్రీ దామ శ్రీకాంత్, డోరు నెం.37-1-256, ట్రంక్ రోడ్, వార్డు నెం.5, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆంధ్రప్రదేశ్-523001, బ్రాంచ్ అడ్రస్ : 1వ స్టెప్, డి.నెం.13/3/40, దర్బార్ రోడ్, చీరాల-523155, 2) శ్రీ దామ వెంకటనారాయణ, తండ్రి : వెంకటేశ్వర్లు, కొట్రవారి వీధి, దర్శి కంపటి, బాపట్ల, గుంటూరు జిల్లా-522101, 3) శ్రీ దామ శ్రీకాంత్, తండ్రి : వెంకట నారాయణ, డి.నెం.13-11-23/2, కొట్రవారి వీధి, దర్శి కాంపౌండ్, బాపట్ల, గుంటూరు జిల్లా-522101, 4) శ్రీమతి దామ పుష్పలత, భర్త : వెంకట నారాయణ, డి.నెం.23/2, కొట్రవారి వీధి, దర్శి కంపటి, బాపట్ల, గుంటూరు జిల్లా-522101. బకాయి మొత్తము : చెల్లించవలసిన బకాయి రూ.86,84,875/- (అక్షరాల ఎనభై ఆరు లక్షల ఎనభై నాలుగు వేల ఎనిమిది వందల డెబ్బై ఐదు రూపాయలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు	ఆస్తి -1 : గుంటూరు జిల్లా, బాపట్ల మున్సిపాలిటీ మరియు మండలం, పశ్చిమ బాపట్ల గ్రామము, దర్శి కాంపౌండ్, పాత కబేళా ఏరియా, కొట్రవారి వీధి, లొకాలిటి నెం.13, కొత్త వార్డు నెం.26, డి.నెం.535/5, ఇంటి డోరు నెం.13-11-21/2కు ఉత్తరం వైపునగల శ్రీమతి దామ పుష్పలత, భర్త : వెంకటనారాయణకు చెందిన 96.80 చ।గ।।ల విస్తీర్ణముగల ఖాళీరెసిడెన్షియల్ స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : ఉత్తరం: దర్శి నాగేశ్వరరావు మరియు ఇతరుల స్థలము, తూర్పు: 12 అడుగుల వెడల్పు గల ఉమ్మడి బజారు, పడమర: కొట్ర రామారావు యొక్క ఇంటి స్థలము, దక్షిణం: అభ్యర్థులు (దామ పుష్పలత) ఇల్లు.	18,52,000/-	1,85,200/-	18,520/-
		ఆస్తి -2 : గుంటూరు జిల్లా, బాపట్ల మున్సిపాలిటీ మరియు మండలం, పశ్చిమ బాపట్ల గ్రామము, దర్శి కాంపౌండ్, కొట్రవారి వీధి, లొకాటలిటి నెం.13, కొత్త వార్డు నెం.23, డి.నెం.535/5, ఇంటి డోరు నెం.13-11-23/2కు ఎదురుగా గల శ్రీమతి దామ పుష్పలత, భర్త : వెంకటనారాయణకు చెందిన 100.22 చ।గ।।ల యార్డ్ విస్తీర్ణముగల ఖాళీస్థలము మరియు అందులోని రెసిడెన్షియల్ బిల్డింగ్‌కు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : ఉత్తరం: దర్శి రామారావు యొక్క స్థలము, తూర్పు: ఉమ్మడి రోడ్డు, పడమర: కొట్ర రామారావు మరియు ఇతరుల యొక్క ఇంటి స్థలము, దక్షిణం: దర్శి వెంకటరమణ యొక్క మిగిలిన స్థలము.	32,03,000/-	3,20,300/-	32,030/-
	ఆస్తి -3 : గుంటూరు జిల్లా, తూర్పు బాపట్ల గ్రామము, మూర్తి రక్షణ నగరం, కొత్త వార్డు నెం.9, తూర్పు బ్లాక్ నెం.2, డి.నెం.716-12, సమీప డోరు నెం.2-5-60 నందు శ్రీ దామ వెంకట నారాయణ, తండ్రి : వెంకటేశ్వర్లుకు చెందిన 423.50 చ।గ।।ల విస్తీర్ణముగల ఖాళీరెసిడెన్షియల్ స్థల యార్డ్ మునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : ఉత్తరం: వల్లగొర్ల శివయ్య మరియు ఇతరుల భూమి, తూర్పు: బోయిన కోటయ్య యొక్క భూమి, పడమర: దొడ్డక పూర్ణచంద్రరావు యొక్క భూమి, దక్షిణం: అమ్మకముదారుల యొక్క భూమి.		34,20,000/-	3,42,000/-	34,200/-
2	ఋణగ్రహీత(లు)/తనఖాదారు(లు)/ హామీదారు(లు)/సహ-పూచీదారు(లు) : మెస్సర్స్ న్యూ విక్టరి స్పోర్ట్స్, యజమాని: శ్రీ పర్వతరెడ్డి శ్రీనివాసరావు, తండ్రి: యానాది (లేటు), డోర్ నెం.45-1-45(బి), కొత్తపట్నం రోడ్డు, ఒంగోలు,ప్రకాశం జిల్లా, ఎ.పి-523001, 2) శ్రీ పర్వతరెడ్డి శ్రీనివాసరావు, తండ్రి: యానాది (లేటు), డోర్ నెం.45-1-45(బి), కొత్తపట్నం రోడ్డు, ఒంగోలు,ప్రకాశం జిల్లా, ఎ.పి-523001, 3) శ్రీమతి పల్లపోతు లక్ష్మీ పల్లవి, భర్త : సురేష్, డోర్ నెం.37/169/17, కర్నూలు రోడ్డు, మటం బజార్, ఒంగోలు, ప్రకాశం జిల్లా-523002. బకాయి మొత్తము : చెల్లించవలసిన బకాయి రూ.26,13,870 (అక్షరాల ఇరవై ఆరు లక్షల పదమూడు వేల ఎనిమిది వందల డెబ్బై రూపాయలు మాత్రమే) మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు	ప్రకాశం జిల్లా, ఒంగోలు ఎస్.ఆర్.ఓ., టంగుటూరు మండలం, టంగుటూరు గ్రామ పంచాయతి, బ్రహ్మంగారి గుడి తూర్పువైపు, చెల్లమ్మతోట ఏరియా, డి.నెం.4-104, సర్వే నెం.1243/1ఎ నందలి శ్రీ పర్వతరెడ్డి శ్రీనివాసరావు, తండ్రి: యానాదికి (లేటు) చెందిన 1146 చ।అ।।లు లేదా 127.33 చ।గ।।లు 106.45 చ।మీ।।లు విస్తీర్ణము గల స్థలం మరియు అందులో నిర్మించబడిన పెంకుటిల్లు అన్ని సౌకర్యములు మరియు ఉపకరణములతో పాటు అన్ని అనుభుక్తపు హక్కులతో కలదు. దీనికి హద్దులు: ఉత్తరం: పర్వతరెడ్డి శ్రీలక్ష్మి యొక్క ఆస్తి, తూర్పు: 18 లి।।ల ఉమ్మడి మార్గము; పడమర: బ్రహ్మంగారి మఠం యొక్క స్థలం, దక్షిణం: సొంత ప్రహరీ గోడ & పర్వతరెడ్డి శ్రీనివాసరావుకు చెందిన ఆస్తి. (డి.30-09-2014 నాటి రిజిష్టర్డ్ పార్టిషన్ దస్తావేజు నెం.9316/2014 ప్రకారం, లాటిట్యూడ్: 15.343500, లాంగిట్యూడ్: 80.038028)	15,92,000/-	1,59,200/-	15,920/-

వేలము తేది మరియు సమయం : 26-06-2025, శుక్రవారం, మధ్యాహ్నం 12.00 గం।।ల నుండి 5.00 గం।।ల వరకు (10 నిమిషాల అపరిమిత పొడిగింపులతో) ఈ- వేలం వెబ్‌సైట్ website- https://baanknet.com

విక్రయమునకు సంబంధించిన నియమ నిబంధనల కొరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెబ్‌సైటు : **www.unionbankofindia.co.in** మరియు ఇ-వేలం ప్రొవైడర్స్ వెబ్‌సైట్: **website https://baanknet.com.** నందు చూడగలరు. అధీకృత అధికారికి తెలిసిన సమాచారము ప్రకారం స్థిరాస్తిపై ఎటువంటి ఎన్‌కంబ్రెన్స్ లేదు. ఆసక్తి గల బిడ్డర్లు అస్తి పరిశీలన కోసం బ్రాంచ్ మేనేజర్ అయిన శ్రీ సైదయ్య,బీమగణి మొబైల్ నెం.**9866998567**, **e-mail : ubin0817830@unionbankofindia.bank** లలో సంప్రదించవచ్చు.

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్ 2002 లోని రూలు 8(6)/రూలు 9(1) అనుసరించి చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకం నోటీసు చెల్లించవలసిన బకాయిలను పూర్తిగా చెల్లించని సందర్భంలో పైన తెలిపిన తేదీన ఇ-వేలం అమ్మకము నిర్వహణ గురించి సదరు ఋణం తీసుకున్న ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని 8(6)/రూలు 9(1) క్రింద దీనిని నోటీసుగా పరిగణించవలెను.

ప్రదేశం : ఒంగోలు, తేది : 23-05-2025 — సం/- చీఫ్ మేనేజర్, అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యస్‌బియమ్‌సి బ్రాంచ్, ఒంగోలు.


దుగ్గిరాలలో 58.6 మి.మీ. వర్షపాతం

సగటున 25.3 మి.మీ. వర్షపాతం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా పొన్నూరు మండలంలో 8.6 మి.మీ. పడింది. సగటున 25.3 మి.మీ.గా నమోదైంది. మే నెల 24వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 48.2 మి.మీ. కాగా.. ఇప్పటి వరకు 166.8 మి.మీ. పడింది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. చేబ్రోలు మండలంలో 52.2, తుళ్ళూరు 40.6, మేడికొండూరు 38.4, ప్రత్తిపాడు 35.2, కాకుమాను 30.2, కొల్లిపర 27.4, తాడికొండ 26.8, మంగళగిరి 23.6, తాడేపల్లి 21.6, ఫిరంగిపురం 19.8, వట్టిచెరుకూరు 19, పెదకాకాని 17.2, గుంటూరు తూర్పు 14.2, గుంటూరు పశ్చిమ 12.2, తెనాలి మండలంలో 9.8 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



నరసరావుపేటటౌన్: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ శ్రీనివాసరావు నాయక్ శనివారం తెలిపారు. నరసరావుపేట రైల్వేస్టేషన్ వద్ద కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలు క్రింద శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడు పింక్ కలర్ చొక్కా, నలుపు రంగు ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు నరసరావుపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని రైల్వే ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



నాదెండ్ల: కారు, బైకు ఢీకొన్న ఘటనలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్సై జి. పుల్లారావు తెలిపిన వివరాల మేరకు... గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై గొరిజవోలు గ్రామ పరిధిలోని నుదురుపాడు ఫైవంతెన వద్ద ప్రమాదం జరిగింది. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన తరిమెళ్ళ బోయేసు (30) తన ద్విచక్రవాహనంపై గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్నాడు. నుదురుపాడు ఫైవంతెన సమీపంలో బైకు, కారు ఢీకొన్నాయి. బోయేసు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం తరలించారు. పూర్తి వివరాలు తెలియరావాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.